ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
ఆదివారం 23 నవంబరు 2025

చదువెట్లా?
- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు
- జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడిన 10 స్కూల్స్

6

పాలమూరు కార్మికులకు అండగా ఉండాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

6

విధేయులకే.. వీర తిలకం



డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఎంపిక చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ, ప్రశాంత్‌కుమార్ రెడ్డికి మరోసారి అవకాశం
- యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన శివసేనారెడ్డి, రాజీవ్‌రెడ్డికి పగ్గాలు
- పార్టీ విధేయుడు సంజీవ్ ముదిరాజ్‌కు పాలమూరు బాధ్యతలు
- సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక


డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్


కె. శివసేనారెడ్డి, వనపర్తి


కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నారాయణపేట


సంజీవ్ ముదిరాజ్, మహబూబ్‌నగర్


రాజీవ్‌రెడ్డి, జోగుళాంబ గద్వాల



మహబూబ్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామక ప్రక్రియను కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తిచేసింది. ప్రతీ జిల్లా నుంచి పదుల సంఖ్యలో నాయకులు దరఖాస్తులు చేసుకోగా పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో ఆ అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ఉత్సుకత అందరిలోనూ ఉన్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షులను ప్రకటించగా వాటిని పరిశీలిస్తే డీసీసీల నియామకంలో పార్టీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది. అటు ఎమ్మెల్యేలతో వివాదాలు రాకుండా, ఇటు సామాజిక సమతుల్యం పాటించే విధంగా పార్టీ చూసుకున్నట్లు అర్థమవుతోంది. దీంతో పాటు పార్టీని అంటిపెట్టుకొని ఉన్న క్రమశిక్షణతో పనిచేస్తున్న వారినే ప్రాధాన్యంగా తీసుకున్నది. నియోజకవర్గాల్లో విభేదాలు ఉన్నచోట్ల లెక్కకు మించి నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. అలాంటిచోట పూర్తి న్యూట్రల్‌గా ఉండే వారిని, ఇరువర్గాలను కలుపుకుపోయే వారికి ప్రాధాన్యం ఇచ్చారు. ఉమ్మడి పాలమూరు

(మిగతా 6లో..)



ఆటలెలా?
- ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో మైదానాలు కరువు
- క్రీడలకు విద్యార్థులు దూరం
- చదువుపైనే దృష్టి
- ఉమ్మడి జిల్లాలో 52 ప్రైవేట్ కళాశాలలు

7

ప్రమాదమా.. హత్యా?
- భీమరాయుడుని హత్య చేశారని కుటుంబీకుల ఫిర్యాదు
- పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో గద్వాలలో ర్యాలీ

7

పట్టపగలు చోరీ
- బంగారం, వెండి నగలను ఎత్తుకెళ్లిన దొంగలు
- భూత్పూర్ మునిసిపాలిటీలోని 10వ వార్డులో ఘటన
- జడ్చర్ల మునిసిపాలిటీలో 2 తులాల బంగారం, 30 తులాల వెండి అపహరణ

7

అడ్డాల కోసం వ్యాపారుల ఆరాటం
వాటాల కోసం అధికారుల పోరాటం

- వారంలో రానున్న నూతన మద్యం పాలసీ
- ఇద్దరు ఎక్సైజ్ ఎస్‌ఐలకు స్థానభ్రంశం
- దుకాణాల కోసం బేరసారాలు
- ఓ దుకాణానికి రూ.90 లక్షల గుడ్‌విల్


మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

మహబూబ్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం పాలసీ ఇటు వ్యాపారులను, అటు అధికారులను టెన్షన్ పెడుతోంది. కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వాళ్లు అడ్డాల కోసం వెదుకుతున్నారు. పబ్లిక్ డిమాండ్, సేల్స్ ఎక్కువగా జరిగే ప్రాంతాల కోసం ఆరాటపడుతున్నారు. కొత్త మద్యం పాలసీకి మరో వారమే గడువు ఉండటంతో వ్యాపారులు సర్దుకునే పనిలో ఉండగా, ఎక్సైజ్ అధికారులు మాత్రం వచ్చే మామూళ్లపై దృష్టి సారించారు. అధికారులు తమ పరిధిలో ఉన్న దుకాణాల నుంచి వచ్చే వాటాల విషయంలో పోట్లాడుకునే పరిస్థితి రావడంతో జిల్లాలో ఎక్సైజ్‌శాఖ పరువు పోతోంది. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పని చేసే ఇద్దరు ఎస్‌ఐల మధ్య నెలకొన్న పంచాయతీ చివరకు వారిని బదిలీ చేసేదాక వెళ్ళింది. మూడు నెలల క్రితం నగరంలో పని చేస్తున్న ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిని రూరల్‌కు బదిలీ చేయగా, రూరల్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ సుష్మను నగరానికి రాజకీయ కారణాలతో బదిలీ చేశారు. కొత్త మద్యం పాలసీ డిసెంబరు 1 నుంచి అమలు కానున్నందున వీరి మధ్య కార్యాలయంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి.

సిబ్బంది ఎదుటే అధికారుల వాగ్వాదం

నగరం పరిధిలో 15 మద్యం దుకాణాలు, 10 బార్లు ఉన్నాయి. రూరల్ పరిధిలో రూరల్‌తోపాటు దేవరకద్ర, సీసీకుంట, కౌకుంట్ల మండలాల్లో 7-8 మద్యం దుకాణాలు మాత్రమే ఉన్నాయి. మద్యం దుకాణాలనుంచి ఎక్సైజ్ అధికారులకు నెల మామూళ్లు ఉంటాయి. నగరంలో అధికంగా దుకాణాలు, బార్లు ఉండటంతో సాధారణంగా ఇక్కడుండే వారికి ఆదాయం ఎక్కువగానే ఉంటుంది. ఈ కారణంగానే సదరు అధికారులు సిబ్బంది ఎదుటే వాదులాడుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. దాంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ చేసి, ఇద్దరు ఎస్‌లను శనివారం బదిలీ చేశారు. సుష్మను అచ్చంపేటకు, సుధాకర్‌రెడ్డిని కొల్లాపూర్‌కు బదిలీ చేశారు. కొత్తమద్యం పాలసీ ముందు ఎక్సైజ్ శాఖకు ఇది షాక్ అనే చెప్పాలి.

గుడ్‌విల్ భారీగానే



మద్యం దుకాణాల కోసం పోటీపడి, దుకాణాలు దక్కని వారు వృత్తిలో కొనసాగాలని, కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారినుంచి బేరసారాలు ఆడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో రెండు దుకాణాలకు భారీగా ఓ దుకాణానికి రూ.95 లక్షలు, మరో దుకాణానికి రూ.90 లక్షలు గుడ్‌విల్ ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. నారాయణపేట జిల్లాలోని ఓ మండల దుకాణానికి రూ.80 వేలు గుడ్‌విల్ దక్కింది.

ఉల్లంఘనులు

- నారాయణపేట జిల్లాలో అక్టోబరు నాటికి 42,594 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు
- రోడ్డు ప్రమాదాల్లో 74 మంది మృతి


నారాయణపేట పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసు(ఫైల్)

కోస్గి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో వాహనదారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. వారి నిర్లక్ష్యం ఇతరులకు ప్రాణసంకటంగా మరుతోంది. జిల్లాలో రోజుకు 4,259 మంది ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తుండటం గమనార్హం. ఈ ఏడాది అక్టోబరు వరకు 42,594 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయి. అందులో రాంగ్ పార్కింగ్ కేసులు 3545 నమోదు కాగా, అధిక వేగం 122, హెల్మెట్ లేకపోవడం 30,811, మొబైల్ డ్రైవింగ్ కేసులు 3,884 నమోదయ్యాయి. 152 రోడ్డు ప్రమాదాల్లో 74 మంది మృత్యువాత పడ్డారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు, జైలు శిక్షలు విధించినా వారిలో మార్పు రావడం లేదు.

అవగాహన కల్పిస్తున్నాం

రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపకుండా నిఘా ఉంచాం. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాం. అతివేగంతో వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. చలి తీవ్రత ఎక్కువ ఉండటంతో ఉదయం, రాత్రి సమయాల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలి.

- డాక్టర్ వినీత్ ఎస్పీ, నారాయణపేట జిల్లా


కప్పెట శివారులో ఏర్పాటు చేసిన ఇసుక డంపు (ఫైల్)


విచ్చలవిడిగా ఇసుక తరలింపుతో తెగిన పోతులమడుగు శివారులోని వాగులోని చెక్‌డ్యాం

వాగులను ఊడ్చేస్తున్నారు

- భూత్పూర్ మండలంలో విచ్చల విడిగా ఇసుక దందా
- పోతులమడుగు శివారులో తెగిన చెక్ డ్యామ్
- అడ్డొచ్చిన వారిపై దాడులు

భూత్పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూత్పూర్ మండలంలోని వాగుల్లో గల ఇసుకను దళారులు ఊడ్చేస్తున్నారు. మండలంలో అమిస్తాపూర్, పోతులమడుగు, రావులపల్లి, కప్పెట, వెల్కిచర్ల గ్రామాల శివారుల్లోని పెద్ద వాగులు ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ప్రవహించాయి. 20 రోజులుగా నీటి ప్రవాహం తగ్గడంతో ఇసుక తేలింది. దాంతో ఇసుక మాఫియా ఇసుకను తరలించి, లక్షలు కూబెట్టుకుంటోంది. రాత్రీ పగలు అని తేడా ఇష్టారాజ్యంగా వాగుల్లోని ఇసుకను తోడేస్తున్నారు. దాంతో వాగులన్నీ ఖాళీ అవుతున్నాయి. అడ్డొచ్చిన వారిపై దాడులకు తెగబడుతోంది. ఎక్స్‌కవేటర్ల ద్వారా ఇసుకను తవ్వి, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. కప్పెట వాగు వద్ద జోరుగా ఇసుక వ్యాపారం సాగుతోంది. వ్యవసాయ అవసరాల కోసమని ట్రాక్టర్లను కొనుగోలు చేసి, ఇసుక దందా చేస్తున్నారు. భూత్పూర్‌లోని కొందరు భరత్ బెంజ్ వాహనాల్లో వేల టన్నుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకుటున్నారు.

సీజ్ చేస్తున్నాం

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలతో పాటుగా ఇసుకను సీజ్ చేస్తున్నాం. కేసులు కేసులు పెడుతున్నాం. వేలం వేసి, ఇసుకను అమ్ముతున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పేరు మీదు ఇసుక దుర్వినియోగం అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

- కిషన్, తహసీల్దార్, భూత్పూర్

పట్టించుకోని అధికారులు

పోతులమడుగు గ్రామ శివారులో రాజీవ్‌స్వగృహ ప్రాంతంలో ఉన్న వాగు నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేయడంతో వాగులో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం తెగిపోయింది. రావులపల్లి వాగులో కూడా ఇదే పరిస్థితి ఏర్పడనుంది. కప్పెట, పోతులమడుగు, రావులపల్లి, భూత్పూర్, అమిస్తాపూర్, ఇంకా పలు గ్రామాల వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు కానీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు కానీ అటు వైపు చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

సీఎం పర్యటనకు
ఏర్పాట్లు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- వచ్చే నెల 1న మక్తల్‌కు రేవంత్‌రెడ్డి రాక
- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి వచ్చే నెల 1న మక్తల్‌కు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ చెప్పారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోలపల్లి వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను సూచించారు. గోలపల్లి సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం సీఎం భూమి పూజ చేస్తారన్నారు. అక్కడి నుంచి సీఎం జాతీయ రోడ్డు మార్గాన వస్తారన్నారు. దారి పొడవున భద్రత ఏర్పాటు చేయాలని, రహదారి వెంట ఉన్న ముళ్లపొదలు తొలగించాలని కాట్రేవప్‌పల్లి రోడ్ వద్ద మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఫైలాన్ ఏర్పాటు, మక్తల్, నారాయణపేట బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. భూమిపూజ అనంతరం ముఖ్యమంత్రి పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. చివరగా గోలపల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. సభకు వచ్చే ప్రజా ప్రతినిధులు, ప్రజల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, వీఐపీ వాహన పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. అంతకు ముందు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి కలెక్టర్ సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేయనున్నర ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రాంచందర్, ఎల్‌జీసీ రాజేందర్‌గౌడ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, డీఆర్‌డీఏ మొగిలప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాతి గుహలు కనుమరుగు
- నల్లమలలోని గుట్టలపై తొలి రాతియుగపు నాటి చారిత్రక ఆనవాళ్లు
- ధ్వంసం చేసి, రాళ్లను తీసుకెళ్తున్న దుండగులు

6


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 120.00
హోల్ సేల్	: 129.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

ధర్మాసుపత్రిలో కాసుల వేటపై.. జాయింట్ డైరెక్టర్ విచారణ

- కలెక్టర్‌కు సోమవారం నివేదిక
- దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు


అమిస్తాపూర్‌లోని బాధితురాలి ఇంటి వద్ద విచారణ చేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం డబ్బులు వసూలు చేయడంపై ధర్మాసుపత్రిలో కాసుల వేట అనే శీర్షికన ఈనెల 20న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు రాష్ట్ర మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రీషియన్ విభాగం జాయింట్ డైరెక్టర్ రాజేశం శనివారం జిల్లాకు వచ్చి విచారణ చేశారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీరియస్‌కాగా, జిల్లా అధికారులు ప్రాథమిక విచారణ చేసి ప్రభుత్వానికి రిపోర్టును పంపించారు. అనంతరం మంత్రి ఆదేశాల మేరకు జేడీ పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ముందుగా ఆయన పీపీ యూనిట్‌లో ఆపరేషన్ చేయించుకున్న మహిళలు, వారి అటెండర్లు, అందులో పనిచేసే స్టాఫ్ నర్సులు, కిందిస్థాయి ఉద్యోగులను విచారణ చేశారు. అనంతరం అమిస్తాపూర్‌లోని బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరతో కలిసి ప్లంబర్‌ను విచారించారు. నివేదిక రూపొందించి, సోమవారం కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై కచ్చితంగా చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. విచారణలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశికాంత్ ఉన్నారు.


మహిళకు చీరను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహిళలకు నాణ్యమైన చీరలు: యెన్నం

మహబూబ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలకు అత్యంత నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మహబూబ్‌నగర్‌లోని మినీ శిల్పారామంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ మహిళలకు కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. నీలం రంగు యూనిఫాం చీరలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 1,847 స్వయం సహాయక సంఘాల్లోని 19,102 మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాతి గుహలు కనుమరుగు

- గుట్టలపై ఉన్న తొలి రాతియుగం నాటి చారిత్రక ఆనవాళ్లు
- నల్లమల ప్రాంతంలోని కొండలపై కనిపించే బండరాళ్ల గుహలు
- కొల్లగొడుతున్న అక్రమార్కులు



గుట్టపై ఉన్న చారిత్రక బండరాళ్లు

అచ్చంపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు చారిత్రక ఆనవాళ్లను ధ్వంసం చేస్తున్నారు. పెద్దపెద్ద కొండలు సైతం అక్రమార్కుల చేత కరిగి పోతున్నాయి. నల్లమల ప్రాంతంలోని కొండలలో గుట్టల పైన కనిపించే వందల, వేల సంవత్సరాల నాటి రాతి గుహలు కొందరి మైనింగ్ దాసోహానికి బలవుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో కొండలను పిండిచేసి రాళ్లను, కంకరను పట్టణాలకు తరలిస్తున్నారు. ఒక ట్రిప్పు రాయికి 5వేలకు పైగా వసూలు చేస్తున్నారు. సొమ్మొకరిది సోకు మరొకరిది అన్న చందనంగా ఆయా పంచాయతీల పరిధిలోని గుట్టలనుంచి బండరాళ్లను కొల్లగొడుతూ ఆ గ్రామ పంచాయతీలకు మాత్రం రూపాయి చెల్లించడం లేదు. ఉప్పునుంతల, అచ్చంపేట, అమ్రాబాద్ వంగూరు తదితర మండలాల పరిధిలో కనిపించే రాతి గుహలు వేల సంవత్సరాల చరిత్ర కలిగినవిగా చరిత్రకారులు చెబుతున్నారు. ఇలాంటి చరిత్ర కలిగిన రాతి గుహలను చిన్న సైజు రాళ్లగా మార్చి సొమ్ము చేసుకొంటున్నారు. ప్రధానంగా ఉప్పునుంతల మండలం పెనిమిల్ల గ్రామశివారులో 200 ఎకరాలలో విస్తరించి ఉన్న గుట్టలపై ఆనాటి మెగాలితిక్ బరియల్స్ (బండరాళ్ల గుహలు) ఉన్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ముచేసుకొంటున్నారు. దళారుల చేతుల్లో మాయమవుతున్న చారిత్రక సంపదను రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మెగాలితిక్ బరియల్స్ ఆదిమానవుని సమాధులు



క్రీస్తు పూర్వం 5వేల సంవత్సరాల నుంచి 10 వేల సంవత్సరాల కాలంలో ఆదిమ మానవులు చనిపోయిన వారి మృతదేహాలను చుట్టూరా రాళ్లను పేర్చి అందులో ఉంచి పైన పెద్దపెద్ద బండలను వేసేవారు. ఇప్పుడు కనిపిస్తున్న బండరాళ్ల గుహలు అవేనని తెలుస్తున్నది. వాటిని మెగాలితిక్ బరియల్స్‌గా పిలుస్తున్నారు.

- మల్లికార్జున్, పురావస్తు పరిరక్షకుడు, అచ్చంపేట

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి అభిషేకాలు



నందివడ్డెమాన్‌లో శనీశ్వర స్వామి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం నాడు పూజించాలని సూచించారు. శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఖాన్ అకాడమీ ద్వారా మంచి ఫలితాలు

- ప్రత్యేక అధికారి సుజాత



ఢిల్లీ సమ్మిట్‌లో పాల్గొన్న తిమ్మాజిపేట కేజీబీవీ ప్రత్యేక అధికారిని సుజాత

తిమ్మాజిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖాన్ అకాడమీ సమ్మిట్ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు ఉన్నాయని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి సుజాత అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారులు పని చేస్తున్న సుజాత ఢిల్లీలో శనివారం నిర్వహించిన ఖాన్ అకాడమీ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాన్ అకాడమీ సమ్మిట్ కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయంలో ఇంప్లిమెంటేషన్ చేయడం హర్షదాయకమన్నారు. ఆరు నెలల నుంచి పాఠశాలల వారీగా ప్రోగ్రెషన్ రిపోర్టులో తిమ్మాజిపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం రాష్ట్ర స్థాయిలో టాప్-3లో ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అంబటిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని సుహానితో పాఠశాల ఉపాధ్యాయులు

లింగాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అంబటి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన పి.సుహానీ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఇటీవల 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-17విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23 నుంచి చౌటుప్పల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సుహాని పాల్గొననుంది. రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, వ్యాయామ ఉపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీని అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుండుమాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్ర మంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముది రెడ్డిపల్లిలో జరిగింది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున ముదిరెడ్డిపల్లి వారి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్ అక్రమంగా తరలిస్తుండగా కోస్గి పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజ మాని డ్రైవర్ కురువ రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పైకం అందక పరేషాన్

- ఏడాది గడిచినా అందని సకుటుంబ సర్వే బిల్లులు
- గద్వాల జిల్లాలో 1,296 మంది ఎన్యుమరేటర్లు, 130 మంది సూపర్‌వైజర్లు
- అందని రూ. కోటీ 45 లక్షల పారితోషికం
- సంవత్సరకాలంగా ఎదురుచూపులు



గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగరావుకు పారితోషికం అందచేయాలని వినతి పత్రం అందచేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా నాయకులు(ఫైల్)

అయిజ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్యుమరేటర్లకు పారితోషికం దక్కడం లేదు. చేసిన పనికి సంవత్సరం పూర్తయినా పైకం అందటం లేదు. ఎన్నో అవమానాలు ఎదుర్కొని, చీదరింపులు, బెదిరింపులు భరించి కుటుంబ సర్వే పూర్తి చేసినా తగిన ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. సంవత్సర కాలం పూర్తయినా అందచేయాల్సిన పారితోషికంపై అధికారులు దృష్టి సారించటం లేదంటున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సకుటుంబ సర్వే చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేసారి సర్వే పనులు 11 రోజుల పాటు చేశారు. మొత్తం 75 ప్రశ్నలు ఉన్న ధ్రువ పత్రాల ద్వారా ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఒక్కో కుటుంబ వివరాలు సేకరించటానికి దాదాపు 1 గంటకు పైగా సమయం పట్టింది. ఈ సమాచారాన్ని సేకరించటానికి వీరు నానా అవస్థలు పడి తలలు పట్టుకున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించి సర్వే చేయించారు. సర్వే పనులు పూర్తిచేసిన వెంటనే డబ్బులు కలెక్టర్ల ఖాతాకు జమచేసి సంబంధిత సర్వేచేసిన ఎన్యుమరేటర్లకు అందచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సర్వే పనులు పూర్తయి సంవత్సరం గడిచినా దాని ఊసే ఎత్తటం లేదు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,296 మంది ఎన్యుమరేటర్లు, 130 మంది సూపర్‌వైజర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఒక్క ఎన్యుమరేటర్‌కు 120 నుంచి 140 కుటుంబాల ద్వారా పూర్తి స్థాయిలో సర్వే చేసి వారి నుంచి పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. గత సంవత్సరం నవంబరులో ఈ సర్వే చేపట్టింది. నవంబరు 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. 10 నుంచి ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. 23వ తేది నుంచి 30వ తేది వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సేకరించిన సకుటుంబ సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

సర్వేలో పాల్గొన్నది వీరే..

ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు అధికారులు, పుర పాలక సిబ్బంది అంతా ఎన్యుమరేటర్లుగా, సూపర్‌వైజర్లుగా సకుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలో పాల్గొన్న వారికి పారితోషికం విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇంకా నిధులు విడుదల కాలేదని జిల్లా స్థాయి అధికారులు చెబుతున్నారు. అందరి ఖాతాలో జమచేసినట్లు ఉత్తర్వులు ఉన్నట్లు చెబుతున్నారు. సర్వేలో పాల్గొన్న ఒక్క ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ. 12 వేలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా మొత్తంగా రూ. కోటీ 45 లక్షలు పారితోషికం అందాల్సి ఉంది.

శ్రమకు తగ్గ ఫలితం అందాల్సి ఉంది



ఎన్నో అవమానాలు ఎదుర్కొని సమగ్ర కుటుంబ సర్వే వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సంవత్సర కాలం పూర్తయినా ఎన్యుమరేటర్లకు పారితోషికం అందలేదు. సంబంధిత జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు సంఘం తరపున సభ్యులతో కలిసి వినతి పత్రాలు అందచేశాం. ఫలితం కనబడటం లేదు. ఎన్యుమరేటర్లకు గౌరవంగా దక్కాల్సిన పారితోషికం అందించాలని కోరుతున్నాం.

- పచ్చర్ల తిమ్మారెడ్డి, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు

పాలమూరు కార్మికులకు అండగా ఉండాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



'పట్నంలో పాలమూరు బిడ్డలు' పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు వలస కార్మికులకు, ఉద్యోగులకు పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అండగా ఉండి ఆదుకోవాలని ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 'పట్నంలో పాలమూరు బిడ్డలు' సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన సభ్యత్వనమోదు పోస్టర్, వాహన స్టిక్కర్స్‌ను శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్నంలో నివాసం ఉంటున్న పాలమూరు బిడ్డలు, కార్మికులు, ఉద్యోగులకు అండగా ఉండాలన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో పాలమూరు కార్మికులకు గుర్తింపు కార్డులు, సంక్షేమ ఫలాలు అందేలా సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, వ్యవస్థాపక సభ్యులు బండి బంగారయ్య, శ్రీరాములు, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అమలు కావడంలేదు

- డాక్టర్ విశారదన్ మహరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భరతదేశంలో నిజమైనటువంటి ప్రజాస్వామ్యం అమలు కావడంలేదని డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. శనివారం పీయూలోని లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించినటువంటి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం అనేటువంటిది బహుజనుల రాజ్యాధికారం సాధ్యమైనప్పుడే అది నిజమైన సామాజిక న్యాయం జరిగినట్లని అన్నారు. వెనుకబడిన తరగతులు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రాజ్యాధికారం దిశగా ముందుకు వస్తారని, అగ్రవర్ణాల ఆధిపత్యం 90శాతం జనాభా ఉన్నటువంటి బహుజనులు, 10శాతం ఉన్నటువంటి రెండు మూడు కులాలు బాధితులుగా ప్రజలందరిని పాలించడం అనేది ఈ దేశ ప్రజాస్వామ్యం యొక్క దౌర్భాగ్యంగా పేర్కొన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ 42 శాతం అమలు చేయడం రాజ్యాంగపరంగా, చట్టబద్ధంగా దక్కవలసినటువంటి రిజర్వేషన్‌గా అభివర్ణించారు. కేంద్రియ విశ్వవిద్యాలయాలు బ్రాహ్మణ అగ్రహారాలుగా మారాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ నూర్జహాన్ బేగం, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ మాలవి, రిజర్వేషన్ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు బెక్కం జనార్దన్, డాక్టర్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువెట్లా..?

- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులేరి?
- జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడిన 10 పాఠశాలలు
- నాలుగు పాఠశాలలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులతోనే బోధన



వనపర్తి జిల్లాలోని దత్తాయిపల్లి చిన్నతండా ప్రాథమిక పాఠశాలలోని ఐదు మందికి బోధిస్తున్న ఏకోపాధ్యాయుడు

వనపర్తి విద్యావిభాగం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నది. గతంలో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం టీచర్ పోస్టులను సైతం భర్తీ చేసింది. అదే విధంగా మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రత్యేక మెనూతో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నది. అయినా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో సరైన వసతులు లేక జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో చాలా పాఠశాలలు మూతపడుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నా ఒకే ఉపాధ్యాయునితో నడుస్తున్నాయి. అన్ని సబ్జెక్టులను అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి రావడం, అనివార్య కారణాల వల్ల ఉపాధ్యాయుడు సెలవుపై వెళితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.

● **జిల్లాలో 119 ఏకోపాధ్యాయ పాఠశాలలు**

దేశంలో సర్వశిక్ష అభియాన్ నిబంధనలను అనుసరించే కిలో మీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలో మీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, 5 కిలో మీటర్ల పరిధిలో ఒక ఉన్నత పాఠశాల ఉండాలి. కానీ జిల్లాలోని చాలా గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు సమీప గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. అయితే, జిల్లా వ్యాప్తంగా 119 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, అందులో జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో దాదాపు 10 పాఠశాలలు మూతపడ్డాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు బదిలీల ప్రక్రియ చేపట్టడంతో మరో నలుగురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. దీంతో నాలుగు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేరు. ఆ మిగిలిన 68 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. మరో 37 పాఠశాలల్లో 15 మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉండడంతో సమీప పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను అక్కడికి సర్దుబాటు చేశారు.

ఇటు ఉపాధ్యాయులకు.. అటు విద్యార్థులకూ కష్టాలే

వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 60 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పది కన్నా తక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు గైర్హాజరవుతుంటారు. అనారోగ్య, ఇతరాత్ర సమస్యలతో ఏరోజైనా ఉపాధ్యాయుడు పాఠశాలకు రాలేని పరిస్థితి ఉంటే విద్యార్థులు ఆ తరగతులను కోల్పోయే పరిస్థితి ఉంటుంది. ఆయా మండలాల్లోని కొన్ని పాఠశాలలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేశారు. దీంతో ఆ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాలకే హాజరు కావలసి ఉంటుంది. దీంతో అత్య వసర పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు రాకున్నా, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయు లు బోధించడానికి అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా పది మందిలోపు విద్యా ర్థులు ఉన్న పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

విధేయులకే.. వీరతిలకం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో కొన్ని పేర్లు ఊహించినవే కాగా మిగతావారి ఎంపిక అనూహ్యమే అని చెప్పవచ్చు. అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం దరఖాస్తులు చేసుకునే సమయంలో పెట్టుకున్న కొన్ని నిబంధనలను కూడా తాజా ఎంపిక ప్రకారం చూస్తే సడలించినట్లు స్పష్టమవుతోంది. అందుకే ప్రజాప్రతినిధిగా, ఇతర పదవుల్లో ఉన్నవారికి అవకాశం ఇవ్వడం, రెండోసారి కొనసాగింపు నిర్ణయం తీసుకోవడం వంటివి తాజా ఎంపికలో చోటుచేసుకున్నాయి.

యూత్‌కు పట్టం...

ఎన్నాళ్లుగానో కాంగ్రెస్ పార్టీలోకి యువరక్తం రావాలనే డిమాండ్ ఉన్నది. యువతకు అవకాశాలు ఇస్తే పార్టీలో మార్పు వస్తుందనే భావన కూడా ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది యూత్ గెలిచినప్పటికీ రానున్న ఎన్నికల నాటికి కొత్త నాయకులను తయారు చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుల ఎంపికలో యువతకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. మొత్తం ఐదు జిల్లాల్లో మూడు జిల్లాల బాధ్యతలను యూత్‌కే అప్పగించారు. నారాయణపేట అధ్యక్షుడిగా ఇప్పటికే కొనసాగుతున్న కొల్లికుదురు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని మరోసారి ఎంపిక చేయగా ఆయన యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చినవారే. తండ్రి దివంగత వీరారెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా, అప్కాబ్ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ మక్తల్ సీట్ ఆశించగా ఆ స్థానం వాకిటికి దక్కింది. అప్పటివరకు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న వాకిటి స్థానంలో మధ్యంతర అధ్యక్షుడిగా ప్రశాంత్‌కు బాధ్యతలు ఇచ్చారు. ఇక వనపర్తి అధ్యక్షుడిగా ఎంపికైన కొత్తకాపు శివసేనారెడ్డి ఎన్ఎస్‌యూఐ స్టేట్‌వైస్ ప్రెసిడెంట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవిలో ఉన్నారు. గద్వాల డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన రాజీవ్ రెడ్డి యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం టీపీసీసీ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. వీరంతా యూత్ కాంగ్రెస్ నుంచి రావడం, యువత కావడంతో ఈ అవకాశం దక్కింది. అలాగే రాబోవు నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా కొత్త వారికి అవకాశం ఇస్తే వీరు కొత్త నియోజకవర్గాల్లో పోటీపడే అవకాశం ఉంటుంది.

సామాజిక ప్రాధాన్యం...

డీసీసీల ఎంపికలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక ప్రాధాన్యాన్ని పాటించినట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తీసుకెళ్తున్న పార్టీ తాజాగా ఉమ్మడి పాలమూరులో రెండు జిల్లాల్లో బీసీలకు అవకాశం ఇచ్చారు. కీలకమైన మహబూబ్‌నగర్‌లో పార్టీ విధేయుడు, టీపీసీసీ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న సంజీవ్ ముదిరాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో అత్యంత ప్రాధాన్య సామాజికవర్గం ఇది. అలాగే గద్వాల జిల్లాకు రాజీవ్‌రెడ్డి మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు కాగా, దీంతో ఇద్దరు బీసీలను సర్దుబాటు చేసినట్లయ్యింది. మున్నూరుకాపు సామాజికవర్గం కూడా ఉమ్మడి జిల్లాలో ప్రాబల్యంగా ఉంటుంది. ఇక రాజకీయ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అవకాశం కల్పించారు. వనపర్తికి శివసేనారెడ్డి, నారాయణపేటకు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కీలకం కానున్నారు. దళిత సామాజికవర్గం నుంచి ప్రస్తుత అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు అవకాశం దక్కింది. ఇందులో డాక్టర్ వంశీకృష్ణకు, ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి రెండోసారి డీసీసీగా అవకాశం కల్పించారు.

బాచారం అడవిలో పునరావాసం కోసం హద్దులు ఏర్పాటు



బాచారం అడవిలో నాటిన సరిహద్దు స్తంభం

పెద్దకొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అప్పర్ ప్లాట్‌లో నివాసం ఉంటున్న గిరిజనులు, గిరిజనేతరులకు పెద్దకొత్త పల్లి మండలం బాచారం గ్రామ అటవీ ప్రాంతంలో పునరావాస పథకంలో భాగంగా సరిహద్దు స్తంభాల నిర్మాణం శనివారం అధి కారులు చేపట్టారు. ఈ ప్రక్రియను విజయవంతంగా కొనసాగుతున్నది. పునరావాస ప్రక్రియ నిర్ణీత కాలంలో పూర్తవుతుంది. ఇప్పటి కేఎన్‌టీసీపీ కేంద్ర ప్రభుత్వం నుంచి మొదటి దశ ఆమోదం పొం దినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. రెండవ దశ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నల్లమల అప్పర్ ప్లాట్ గిరిజనుల కల త్వరలోనే సాకారం కానుంది.

సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు డిప్యూటీ సివిల్ సర్జన్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో ఉమ్మడి జిల్లాలోని గద్వాలలోని మానవపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మిప్రసన్న, నారాయణపేట పీపీ యూనిట్‌లోని డాక్టర్ బాలాజీ రావు, మహబూబ్‌నగర్‌లోని నవాబ్‌పేట పీహెచ్‌సీ డాక్టర్ మహ్మద్ రఫీక్, మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని డాక్టర్ భాస్కర్ నాయక్, సీసీకుంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహ్మద్ అస్గర్ అలీ, జనరల్ ఆసుపత్రిలోని డాక్టర్ జరీనా భానులు ఉన్నారు. వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

చిన్నంబావి నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామానికి చెందిన రాజేశ్, రమాదేవిలకు ఇద్దరు మగ పిల్లలు, ఒక అమ్మాయి సంతానం. పెద్ద కుమారుడు చేగువేరా బాలానగర్ గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. బ్యాంక్ అకౌంట్ కోసమని పెబ్బేరులో నివసిస్తున్న తల్లిదండ్రుల దగ్గరికి వచ్చాడు. ఈ తరుణంలో జ్వరం రావడంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజులు చికిత్స పొందాడు. తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ వెళ్లారు. అక్కడా తగ్గకపోవడంతో హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అప్పు తీసుకొని హత్య

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళతో ఓ వ్యక్తి అప్పు తీసుకుని హత్య చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సీఐ కృష్ణ విలేకరులతో వివరాలు వెల్లడించారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని నాగవరం గ్రామానికి చెందిన రేగులక్ష్మి(47) వనపర్తి పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తుంది. ఈ నెల 12న అనుమానాస్పదంగా మృతిచెందడంతో టౌన్ పోలీస్ స్టేషన్‌లో రేగులక్ష్మి బంధువు శశికళ ఫిర్యాదు చేసింది. ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో వనపర్తి మండలం అంకూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ రెడ్డి పరిచయం ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా రేగులక్ష్మి కొన్ని నెలల కిందట కొంత డబ్బును అప్పుగా తీసుకున్నట్లు, ఆ డబ్బుల గురించి పదే పదే అడుగుతూ ఉందని, ఎలాగైనా ఆమెను చంపేస్తే డబ్బులు కట్టాల్సిన అవసరం లేదని ఆలోచించి ఈ నెల 11న అర్ధరాత్రి రేగులక్ష్మి ఇంటికి వెళ్లి హత్య చేశాడు. హత్యకు పాల్పడిన శ్రీనివాస్ రెడ్డిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ కిందపడి బాలుడి దుర్మరణం


కార్తీక్ (ఫైల్)

మానవపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రానికి చెందిన విష్ణుకుమార్ నాయుడు, పార్వతమ్మ రెండో సంతానం కార్తీక్ నాయుడు(4) ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కార్తీక్ నాయుడు స్కూల్‌కి వెళ్లేందుకు ఇంటి నుంచి రాగా, ఈ క్రమంలో రోడ్డుపై ట్రాక్టర్ రివర్స్ వస్తున్న క్రమంలో కార్తీక్ నాయుడుపైకి వెళ్లింది. ట్రాలీ టైరు ఎక్కి తలకు రక్త గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై విష్ణుకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు సంప్‌లో పడి వ్యక్తి మృతి

హన్వాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని కొనగట్టుపల్లి గ్రామానికి గడ్డం రఘు(35) ప్రమాదవశాత్తు సంప్‌లో పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మూడు రోజుల క్రితం రఘు అయ్యప్ప మాల ధరించి సల్లోనిపల్లి శివారులోని దేవాలయంలో ఉంటున్నాడు. అయితే శుక్రవారం రాత్రి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి సంప్‌లో పడ్డాడు. అటుగా ఉన్న వారు గమనించి అతన్ని సంప్ నుంచి తీసే లోపే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. శనివారం భార్య కీర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

ఎర్రవల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కొండేరు స్టేజి సమీపంలో ఇండియన్ పెట్రోల్‌బంక్ ఎదురుగా శుక్రవారం రాత్రి కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మి(40) రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ రవి తెలిపారు.

బైక్ ఢీకొని యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బైకు ఢీకొని యువకుడు పానుగంటి శ్రీను(23) మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం... మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పానుగంటి శ్రీను అతని స్నేహితుడు వినోద్ కలిసి బైకు మీద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్ గ్రామంలో శుభకార్యానికి శుక్రవారం వచ్చారు. శుభకార్యం ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో ఇద్దరు కలిసి వెళ్తుండగా నాగనూల్-నాగర్‌కర్నూల్ మధ్యలో మల విసర్జన కోసం బైకును ఆపారు. అయితే శ్రీను ఫోన్ మాట్లాడుకుంటూ రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా వెనకాల నుంచి నాగనూల్ గ్రామానికి చెందిన వెంకటేశ్ బైక్‌పై వేగంగా వచ్చి శ్రీనును కొట్టాడు. ఈ సంఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శనివారం మధ్యాహ్నం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలిస్తుండగా భూత్పూర్ సమీపంలో తుదిశ్వాస వదిలాడు. ఈ సంఘటనపై మృతుని తండ్రి బిచ్చమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

జాతీయ రహదారిపై డీసీఎం బోల్తా

» ఇద్దరికి గాయాలు


44వ నెంబర్ జాతీయ రహదారిపై బోల్తాపడిన డీసీఎం

అలంపూరుచౌరస్తా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ఇటిక్యాలపాడు గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మహారాష్ట్రలోని చందాపూర్ నుంచి తాడిపత్రికి బయలుదేరిన డీసీఎం ఇటిక్యాలపాడు శివారులో ప్రయాణిస్తుండగా టైరు పగిలి అదుపుతప్పి సిల్వర్ రైలింగ్‌ను చీల్చుకుంటూ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ అశ్రఫ్, ఖదర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

బైకును ఢీకొట్టిన కారు

» ఇద్దరికి గాయాలు

పెద్దకొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వావిళ్లబావి గ్రామం బస్‌స్టేజీ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బైకిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి వాసి తన కారులో నాగర్‌కర్నూల్ వైపు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం వెళ్తున్నాడు. పెద్దకొత్తపల్లిలో ఓ వ్యాపారి వద్ద హమాలీ పని చేస్తున్న ఇద్దరు బీహారీలు అదే మార్గంలో మధ్యలో ఉన్న వావిళ్లబావి గ్రామంలో మొక్కజొన్న ధాన్యం తూకం వేశారు. అనంతరం తిరిగి బైకుపై బీహరీ హమాలీలు పెద్దకొత్తపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే ఈ ప్రమాదంలో బైకుతోపాటు కారు దెబ్బతిన్నది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పట్టపగలు చోరీ

» బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు

భూత్పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దొంగలు పట్టపగలు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో చోటు చేసుకుంది. బాధితుని కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీలోని 10వ వార్డులో నివాసం ఉంటున్న బలిజే శివరాజు ఇంటిపక్కన కిరాణ దుకాణం పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, పది రోజుల క్రితం తన కుంటుబ సభ్యుల్లో ముగ్గురు అనారోగ్యం బారిన పడ్డారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారంతా అక్కడే ఉన్నారు. ఈ తరుణంలో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి రెండు బీరువాలను పగులగొట్టి అందులో ఉన్న నగదు రూ.5వేలు, 10 గ్రాముల బంగారం, 3 జతల వెండి పట్టీలను దోచుకెళ్లారు. ఈ విషయాన్ని బాధితుని కూతురు గమనించి తండ్రి శివరాజుకు ఫోన్ చేసింది. వెంటనే గ్రామానికి చేరుకొన్న బాధితుడు ఇంట్లో బీరువాలోని వస్తువులను పరిశీలించాడు. జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం బృందం వారు దొంగతనం జరిగిన తీరను పరిశీలించారు. దొంగలు ఇంటికి ఉన్న సీసీటీవీ కెమెరాలను తొలగించి దొంగతనం చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.

తాళం వేసిన ఇంట్లో..

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలోని బాలాజీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... బాలాజీనగర్ కాలనీకి చెందిన మసూదాబేగం ఈ నెల 20న ఇంటికి తాళం వేసి హైదరబాద్‌కు వెళ్లి, తిరిగి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉండడం, బీరువాలో దుస్తులు చిందరవందరగా ఉన్నాయని, బీరువాలో దాచిన 2తులాల బంగారు వస్తువులు, 30తులాల వెండి వస్తువులు చోరీ అయినట్లు మసూదాబేగం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఆటలెలా..?

● స్థలాల్లేక విద్యార్థుల దిగాలు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ ఆడుతున్న ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులు(ఫైల్)

» ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో క్రీడలకు చోటెక్కడ?
» ఎప్పుడూ చదువుపైనే యాజమాన్యాల దృష్టి
» కళాశాల ఏర్పాటుకు అన్నీ ఉన్నట్లు పత్రాలు
» ఉమ్మడి జిల్లాలో 52 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఉన్నా అందుకు తగ్గ వసతులు లేవు. శిక్షణ ఇచ్చే వారు లేక.. ఆట స్థలాలు లేక క్రీడలకు దూరం కావల్సి వస్తోంది. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో తమకు ఇష్టమైన ఆటల్లో ఆడాలని విద్యార్థులకు ఉన్నా యాజమాన్యాలు మాత్రం నిత్యం చదువుపై ధ్యాస పెడుతున్నారు. ర్యాంకు సాధించాలన్న ఒత్తిడి తప్ప.. విద్యార్థుల ఇష్టాలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో విద్యార్థులు ఆటలు ఆడేందుకు రెండు, మూడు కళాశాలలు మినహా మిగతా జూనియర్ కళాశాలల్లో ఆటస్థలాలు లేవు. దీని పర్యవసానంగా ప్రతిభ ఉన్న ఎందరో విద్యార్థులు వెలుగులోకి రాలేక పోతున్నారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కొందరు విద్యార్థులు తమ స్వంత ప్రతిభతో జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు.. కానీ అనుకున్న స్థాయిలో వారికి ప్రోత్సాహం లభించడం లేదు.

ప్రైవేట్ కళాశాలల్లో క్రీడలకు దక్కని చోటు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఆడుకునేందుకు ఆట స్థలాలు లేవు. అన్ని కళాశాలల్లో ఇరుకు గదుల మధ్య తరగతులు కొనసాగుతున్నాయి. బహుళ అంతస్థుల భవనాలున్నా విశాలమైన స్థలం ఉన్న కళాశాలలు ఎక్కడా కనింపించవు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రెండు మూడు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు మాత్రం కొంత మేర స్థలాలు కనిపిస్తాయి. అసలు కళాశాలకు అనుమతి పొందే సమయంలో "తాము కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, ఆటస్థలం, ఫైర్ సేఫ్టీ, కళాశాల చుట్టూ విశాలమైన స్థలం ఉందని" ఇంటర్ బోర్డు అధికారులకు అన్ని కాగితాలు చూపిస్తారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల బోధన తోపాటు, వ్యాయామ విద్యకు సంబంధించి కళాశాలలో ఇద్దరు నుంచి ముగ్గురు పీడీలు కూడా ఉండాలి. కానీ, కనీసం ఏ ఒక్క కళాశాలలో కూడా పీడీలు లేరు. అసలు క్రీడలకు సమయం లేదు. విద్యార్థులకు ఎప్పుడు చూసినా చదువు చదువు తప్ప మరే ఇతర విషయాలపై ప్రైవేట్ కళాశాల యాజామాన్యాలు దృష్టి పెట్టడం లేదు.

ప్రైవేట్ కళాశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం తప్పనిసరి

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా కళాశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించుకొని విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలి. కళాశాలలు అనుమతి పొందే సమయంలో తమకు క్రీడల కోసం అనువైన స్థలం ఉందని, జిల్లాని అన్ని కళాశాలలు ఆట స్థలాలు ఉన్నట్లు కాగితాలు చూపించారు? అయితే, అసలు ఉన్నాయా లేదా అన్నది పర్యవేక్షిస్తాం.

\- కౌసర్ జాహన్,
డీఐఈవో, మహబూబ్‌నగర్ జిల్లా

అండర్-19 క్రీడల్లో ప్రైవేట్ విద్యార్థుల ప్రాతినిథ్యం అంతంతే

జూనియర్ కళాశాలల స్థాయిలో నిర్వహించే అండర్-19 క్రీడల్లో ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రాతినిథ్యం అంతగాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ తదితర క్రీడా పోటీలు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించారు. అందులో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు మాత్రం అనుకున్న స్థాయిలో చోటు దక్కడం లేదు. గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మాత్రమే చాలావరకు ఉంటున్నారు.

చదువు తప్ప క్రీడల్లో ప్రైవేట్ విద్యార్థులకు అనుకున్న స్థాయిలో చోటు దక్కడం లేదు. క్రీడలపై మక్కువ ఉన్నా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోలేక పోతున్నారు.

సమాజంలోని అసమానతలపై కొట్లాడాలి

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య


మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా 3వ మహాసభల సందర్భంగా స్థానిక మెట్రో ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన విద్యార్థి బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలోని పలు అంతరాలపై కొట్లాడాలని, తలకిందులుగా ఉన్న సమాజాన్ని సరిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ రూ.3 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఉదయం స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి ప్రారంభమైన విద్యార్థి ప్రదర్శన పాతబస్టాండ్, సత్యనారాయణచౌరస్తా, కొత్తబస్టాండ్, అంబేడ్కర్‌చౌరస్తా మీదుగా మెట్రో ఫంక్షన్‌హాల్‌కు చేరి మహాసభ జరిగింది. ఈ మహాసభలో ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్, ప్రముఖ న్యాయవాది ఎం.కాశీశ్వర్, రాష్ట్ర మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామక్రిష్ణ, బి.రాము, మాస్ లైన్ పార్టీ మక్తల్, నారాయణపేట డివిజన్ కార్యదర్శులు ఎ.సలీమ్, కె.కాశీనాథ్, జిల్లా కార్యదర్శి బి.అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులు సంధ్యా, బి.వెంకటేశ్, ఉపాధ్యక్షుడు గౌస్, కోశాధికారి బి.మహేష్ పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ, ఫార్మసీ, బీఈడీ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన వివిధ కోర్సుల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఎల్ఎల్‌బీ 2, 4 సెమిస్టర్‌లు, బీ ఫార్మసీ 4,6 సెమిస్టర్‌లు, ఎం ఫార్మసీ 2వ సెమిస్టర్, బీఈడీ 2,4 సెమిస్టర్‌లు, బిపిఎడ్ 2వ సెమిస్టర్‌ల రెగ్యులర్, బ్యాక్‌లాక్ ఫలితాలను పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబుతో కలిసి విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్‌లో 68.85 శాతం, 4వ సెమిస్టర్‌లో 86.81 శాతం, బీ ఫార్మసీ 4వ సెమిస్టర్‌లో 60.40 శాతం, 6వ సెమిస్టర్‌లో 57.77 శాతం, ఎంఫార్మసీ 2వ సెమిస్టర్‌లో 72.22 శాతం, బీఈడీ 2వ సెమిస్టర్‌లో 71.98 శాతం, 4వ సెమిస్టర్‌లో 93.48 శాతం, బిపిఎడ్ 2వ సెమిస్టర్‌లో 87.13 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే రీవాల్యుయేషన్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అనురాధరెడ్డి, అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ సురేష్, డాక్టర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు


ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ 1,3,5వ సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీయూలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులకు ఆర్డర్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, 47 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారని తెలిపారు. ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ అరుంధతి రెడ్డి, డాక్టర్ ఈశ్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులకు డాక్టర్ అర్జున్‌కుమార్, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ సత్యభాస్కర్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమా.. హత్యా?

» భీమరాయుడుని హత్య చేశారని కుటుంబ సభ్యుల ఫిర్యాదు
» పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో గద్వాలలో ర్యాలీ


గద్వాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నందిన్నె గ్రామస్థులు, నాయకులు

ధరూర్/ కేటీదొడ్డి/ గద్వాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామ మాజీ సర్పంచు చిన్న భీమరాయుడు (40)ని శుక్రవారం ధరూర్ మండలం జాంపల్లి వద్ద బొలెరో వాహనం ఢీకొనగా, మృతి చెందాడు. ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఎనిమిది మందిపై ఫిర్యాదు చేశారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగానే వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేశారని ఆరోపిస్తూ శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతునాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐలు ఆసుపత్రి వద్ద బందోబస్తు నిర్వహించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాన్ని వాహనంలో ఎక్కించి గద్వాల పట్టణం గుండా ర్యాలీగా నందిన్నె గ్రామానికి చేరుకున్నారు.

హత్య దిశగా విచారణ ముమ్మరం

కాగా మాజీ సర్పంచు చిన్న భీమరాయుడుది రోడ్డు ప్రమాదం కాదని హత్యేనని కుటుంబ సభ్యులు తేల్చిచెప్పడంతో పోలీసులు ఆ దిశగా విచారణ ముమ్మరం చేశారు. ఆయనతో ఎవరెవరికి వైర్యం ఉందో ఆరా తీశారు. గత కొన్ని నెలల నుంచి ఓ వ్యాపారి చేసిన కోట్ల రూపాయల అక్రమాలను వెలుగులోకి తీసుకరావడంతో కేసు నమోదు అయ్యింది. దీనిని మనసులో పెట్టుకొని ఏమైన చేశాడా అనేకోణంలో విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఫోన్‌పేలో బొలెరో వాహనం డ్రైవర్‌కు డబ్బు పంపించిన విషయం గుర్తించినట్లు తెలిసింది. అదేవిధంగా దాయాదుల మధ్య పొలం వివాదంతో పాటు ఇతర అంశాలపై దృష్టి పెట్టారు. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలుస్తున్నది. భీమరాయుడుని ఢీకొట్టి వాహనం కర్నూల్ జిల్లా గోనెగండ్ల మండలం, పుట్టపాశం గ్రామంగా తేల్చారు.

నందిన్నెలో ఉద్రిక్త వాతావరణం

కాగా గద్వాల నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు మృతదేహం నందిన్నెకు చేరుకుంది. గ్రామంలో ర్యాలీ నిర్వహించి కొద్ది సేపు ధర్నా చేశారు.

మృతదేహన్ని ఇంటికి చేర్చే క్రమంలో వైరం ఉన్న వ్యాపారికి సంబంధించి ఆస్తులు కనిపించడంతో ఒక్కసారిగా గ్రామస్థులు, అభిమానులు రాళ్ల రువ్వారు. పోలీసులు 200 మందికిపైగా బం దోబస్తు నిర్వహించడంతో వారిని అడ్డుకున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఈ నెల 24న స్టేడియం మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జాకీర్‌బిన్ మక్సూద్, నసూరుల్లాహైదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న అండర్-17, 19 ఉమ్మడి జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ బాల,బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో, అండర్-19 క్రీడాకారులు పదవ తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు ఇండోర్ స్టేడియంలో పీడీ అప్రోజ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

25న ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న అండర్-17, 19 ఉమ్మడి జిల్లా రగ్బీ బాల,బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో, అండర్-19 క్రీడాకారులు పదవ తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీ నరసింహులుకు రిపోర్టు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికైన రాజాపూర్ విద్యార్థి


రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రాజాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి యు.కీర్తన ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ ఇబ్రహిం శనివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుంచి, సంగారెడ్డి జిలాల్లో జరుగుతున్న అండర్-19 రాష్ట్ర స్థాయిలో క్రికెట్ పోటీల్లో ఆడనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరు రాష్ట్రస్థాయిలో ప్రతీభ కనబర్చి పాఠశాలకు పేరు తీసుకు రావాలని విద్యార్థిని కీర్తనను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటమ్మ, ఉపాధ్యాయుల బృందం, తది తరులు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపి, జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని సూచించారు.

ఇంటర్వ్యూ..

కర్షకమిత్ర రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

» సింగిల్ విండో చైర్మన్ గురు శ్రీనివాస్‌రెడ్డి



కోయిలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కర్షక మిత్ర, ఏఐఎఫ్ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ గురు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

కర్షక మిత్ర పథకంలో ఎంత రుణం ఇస్తారు?

కర్షక మిత్ర పథకం ద్వారా రైతుకు రెండెకరాల నుంచి నాలుగెకరాలకు రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు వరకు రుణం అందిస్తారు. ఇందుకోసం రైతు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాల్సి ఉంటుంది.

వ్యవసాయ పనిముట్లకు ఎలాంటి రుణాలు ఇస్తారు?

కేంద్రం అమలు చేస్తున్న ఏఐఎఫ్ పథకం ద్వారా వ్యవసాయ పనిముట్లు హార్వేస్టర్, ట్రాక్టర్‌తో పాటు ఇతర పనిముట్లతో రుణంలో 3 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుంది.

గేదెలు, గొర్రెలకు రుణాలు ఇస్తారా?

పాడి గేదెలు, గొర్రెల యూనిట్‌ల కోసం సహకార సంఘం సింగిల్‌విండో ద్వారా రూ.10 లక్షల వరకు రుణాలు అందించడం జరుగుతుంది. ఒక గొర్రెల యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొటేలు కోసం రూ.1.90 లక్షలు అందించడం జరుగుతుంది.

రుణాల కోసం ఎలాంటి పత్రాలు అందించాలి?

రైతు పట్టాపాస్ పుస్తకంతో పాటు 12 సంవత్సరాల పహణీ అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న కర్షక మిత్ర, ఏఐఎఫ్ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

మండలానికి 12,100 చీరలు

కోయిలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలానికి 12,100 ఇందిర మహిళా శక్తి చీరలు వచ్చినట్లు ఎంపీడీవో ధనుంజయగౌడ్ తెలిపారు. ఆదివారం నుంచి గ్రామాల్లో ఐకేపీ ద్వారా మహిళలకు చీరలు అందించనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

కోయిలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన అయ్యనోళ్ల చంద్రకళ జ్ఞాపకార్థం శనివారం కుటుంబ సభ్యులు సుభాష్‌గౌడ్, శ్రీలత, నిరంజన్‌గౌడ్ విద్యార్థులకు ప్లేట్లు, పాఠశాలకు మైక్‌సెట్ అందించారు. పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని హెచ్‌ఎం నర్సింహులు భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, సువార్తమ్మ, సురేందర్‌రెడ్డి, పురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

మిడ్జిల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దుందుభీ వాగు నుంచి నిత్యం రాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున వాగు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ అడ్డుకోబోయిన వారిపై దాడులు చేసేందుకు వెనుకాడటంలేదన్నారు. ఇసుక అక్రమ రవాణా మండల అధికారుల కనుసన్నల్లో జరుగుతోందని, జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు.

కొనసాగిన క్రయ విక్రయాలు

దేవరకద్ర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం ధాన్యం క్రయ విక్రయాలు కొనసాగాయి. పెద్ద హంస 68 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1859, కనిష్ఠంగా రూ.1,804 పలకగా, ఆర్ఎస్ఆర్ 1204 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2,752, కనిష్ఠంగా రూ.2,456, పెద్ద సోన 191 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,302, కనిష్ఠంగా రూ.2170 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

నల్లచట్టాలతో కార్పొరేట్లకు లాభం

పాలమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం కార్పొరేట్లకు లాభం చేకూర్చటానికే నల్ల చట్టాలు, నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి రామ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావటం, కార్మిక వర్గానికి చెంపపెట్టులాంటిదన్నారు. కేంద్రం నవంబరు 22న దేశవ్యాపితంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 26న జిల్లా కేంద్రంలో ధర్నా చేపడుతామన్నారు. కార్మికులు, రైతుల పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోతుల రహదారిపై.. తప్పని గోస

» అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

శాశ్వత పరిష్కారం చూపాలి..



రోడ్డుపై అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు కిందపడటంతో తాము సొంతంగా మట్టి పోసినా.. మళ్లీ యథావిధిగా గుంతలు ఏర్పడ్డాయి. రాణిపేట నుంచి అయ్యవారిపల్లి గ్రామం వరకు రోడ్డుపై గుంతలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

\- పండుగ ప్రదీప్‌రెడ్డి



రాణిపేట - అయ్యవారిపల్లి గ్రామాల మధ్య గోతులమయమైన రోడ్డు

మిడ్జిల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణిపేట - వెలుగొమ్ముల గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు పరిస్థితి రోజురోజుకీ దారుణంగా మారుతోంది. అడుగడుగునా గోతులతో వాహనదారులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. ఈ రహదారి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించారు. రాణిపేట - అయ్యవారిపల్లి గ్రామాల మధ్య కేఎల్ఐ కాల్వ అటు, ఇటు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయకుండానే వదిలేయడంతో ఆ ప్రాంతంలో గోతులు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు పలుమార్లు కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో గోతులు నీటితో నిండిపోవడంతో రహదారి ఎక్కడ ఉందో గుర్తించడం కష్టమవుతోంది. ప్రస్తుతం ఈ రహదారి ఆర్‌అండ్‌బీ (రోడ్స్ అండ్ బిల్డింగ్స్) శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు ఏ విధమైన మెయింటెనెన్స్ పనులు చేపట్టకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. ఇంకా ఆలస్యమైతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆస్తులు కాదు.. చదువే శాశ్వతం

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల/మహబూబ్‌నగర్ అర్బన్/విద్యావిభాగం/ న్యూటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆస్తులు కాదు.. చదువే శాశ్వతమని, సరైన అవకాశాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లి శ్రీ మలయాళస్వామి లలితాంబిక తపోవనంలో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించగా, ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి, 150 మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. జడ్చర్ల అవోపా సభ్యులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్, కోఆర్డినేటర్ రవీందర్, ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో సుధాకర్‌రెడ్డి, జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి, తపోవనం అధ్యక్షుడు భాస్కర్, గుండా వెంకటేశ్, ప్రమోద్ పాల్గొన్నారు. అంతకుముందు నగరంలోని మయూరి పార్క్ సమీపంలోని ఈద్గా (అహ్లె హదీస్) వద్ద తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) నిధుల రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే కాంపౌడ్‌వాల్, షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌కు చెందిన జి.విశాల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తుండగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. తెలంగాణ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

లక్కీడిప్ ద్వారా వార్డుల ఎంపిక



భూత్పూర్‌లో లక్కీ డిప్ ద్వారా రిజర్వేషన్లు ప్రకటిస్తున్న అధికారులు

నవాబ్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లక్కీడిప్ ద్వారా మండలంలోని గ్రామ పంచాయతీల వార్డుల రిజర్వేషన్ ఎంపిక కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో జయరాములు తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈ ఎంపిక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 42 గ్రామ పంచాయతీలకు గాను 354 వార్డులు ఉన్నట్లు తెలిపారు.

● భూత్పూర్ : మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు గాను 174 వార్డులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి సమక్షంలో రిజర్వేషన్ ప్రక్రియను అధికారులు ప్రకటించారు. బీసీలకు 40, ఎస్సీలకు 31, ఎస్టీలకు 27, రిజర్వేషన్ కానివి 76గా అధికారులు ప్రకటించారు. ఎంపీవో శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు సత్యనారాయణ, హర్యానాయక్, వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింహులు, శ్రీను, ప్రతాప్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● కోయిలకొండ : మండలంలోని 380 పంచాయతీ వార్డు సభ్యులకు రిజర్వేషన్లు అఖిల పక్ష సమావేశంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్ ప్రకటించారు. కొన్ని వార్డులను డిప్ ద్వారా ప్రకటించారు. ఎంపీవో చంద్రశేఖర్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు రవీందర్, కృష్ణయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

● హన్వాడ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యశోదమ్మ, ఎంపీవో జగదీష్, అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్లుకు లక్కీ డిప్ తీశారు. మండలంలోని 35 గ్రామ పంచాయల్లో, 302 వార్డులు ఉన్నాయి. ఎస్సీ 36, ఎస్టీ 85, బీసీ 58, జనరల్ 123 స్థానాలు కేటాయించారు. మహిళలకు 50 శాతం లక్కీ డిప్‌తో రిజర్వేషన్లు ఖరారు చేశారు. 132 మంది మహిళలు, 170 పురుషులకు వార్డులను కేటాయించారు. కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు మహేందర్, కొండ లింగన్న పాల్గొన్నారు.

నిరసన దీక్ష పోస్టర్ విడుదల

జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న చేపట్టే నిరసన దీక్ష కార్యక్రమ పోస్టర్‌ను శనివారం పట్టణంలోని గిరిజన మహిళ వసతి గృహ ఆవరణలో విడుదల చేశారు. గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్ మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలనే ఉద్దేశ్యంతో కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలన్న మాజీ ఎంపీ సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు.

బిహార్ ఫలితాల స్ఫూర్తితో.. తెలంగాణలోనూ అధికారంలోకి

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్



శాంతికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిన్నచింతకుంట/జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయ డంకా మోగించిందని అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జాతర మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుమూర్తి జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఇది రానున్న ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉందన్నారు. అంతకుముందు జడ్చర్ల మునిసిపాలిటీ నేతాజీ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో వందేమాతరం గీతం 150 వసంతాల మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో జాతిని జాగృతి చేయడానికి వందేమాతరం గీతం ఉద్భవించిందన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు నంబిరాజు, శ్రీకృష్ణ, నరేందర్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, అంజన్న, రాఘవేందర్, సురేందర్, సామల నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి, శేఖర్, రవి, కృష్ణ, కిట్టు, రాజు, అవినాష్, శ్రీనివాస్‌గౌడ్, అరవింద్ గౌడ్, మయూర్‌నాథ్, దివాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వేంకటేశ్వరకాలనీలోని సత్యసాయి మందిరంలో మెగా రక్తదాన, మధుమేహ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. మధుమేహ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5.0 కార్యక్రమ నివేదికలు అందజేయాలి

జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పాఠశాలలో క్యాంపెయిన్ 5.0 కార్యక్రమ నివేదికలను ఎమ్మార్సీలో అందజేయాలని ఎంఈవో మంజులాదేవి సూచించారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో శనివారం మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆపార్ 80 శాతం పూర్తయ్యిందని, వందశాతం పూర్తి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు అనంతప్ప, లక్ష్మీ, చంద్రకళ, శ్రీనివాస్, ఆర్పీలు శేషసేనారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన సప్తశక్తి సంగం

జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి సరస్వతి శిశు మందిరంలో శనివారం సప్తశక్తి సంగం కార్యక్రమం నిర్వహించగా, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, పాఠశాల అధ్యక్షురాలు పద్మలీల, న్యాయవాది సాహితిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కుటుంబ ప్రబోధన్, పర్యావరణం, భారతదేశ వికాసంలో మహిళల పాత్ర తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, నోముల కృష్ణయ్య, ఉపాధ్యాయుడు యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుట్టుమిషన్ అందజేత



కుట్టుమిషన్ అందజేస్తున్న ట్రస్టు సభ్యుడు

జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలూరు జడ్పీహెచ్ఎస్‌కు శ్రీరామ్ చారిటబుల్ ట్రస్టు, థర్మో కేబుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కుట్టుమిషన్‌ను అందజేశారు. విద్యార్థినులకు కుట్టు నేర్పించేందుకు కుట్టు మిషన్ అందజేశారని హెచ్‌ఎం అహ్మద్‌షరీఫ్ తెలిపారు. పాఠశాలలోని వృత్తివిద్యా ఉపాధ్యాయురాలు నిర్మల ఆధ్వర్యంలో 65 మంది విద్యార్థినులకు కుట్టు నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిహరన్, అబ్దుల్‌అలీమ్, సోమ్లా, నిర్మల, హైమావతి, మంజుల, సంధ్య, విజయ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే జీఎంఆర్



విద్యార్థినికి షూ తొడుగుతున్న ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణంలో 3 వేల మంది విద్యార్థులకు షూ పంపిణీ చేసి, మాట్లాడారు. సర్కారు బడులను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే పాఠశాలల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో చిన్నచింతకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ మంజూరుకు కృషి చేస్తానని, అలాగే స్టేజీ నిర్మాణం కోసం తన నిధుల ద్వారా రూ.5 లక్షలు విడుదల చేస్తానన్నారు. దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో మురళీకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, కృష్ణకుమార్ రెడ్డి, ప్రతాప్, మహమూద్, రంజిత్‌రెడ్డి, శేఖర్, భరత్ పాల్గొన్నారు.

అందరూ హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించిన కలెక్టరేట్ సిబ్బందికి పెన్నులు బహుకరిస్తున్న అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అందరు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బంది హెల్మెట్ ధరించిన వారికి పెన్నులు బహుకరించారు. ప్రతీ రోజు ద్విచక్ర వాహనంతో విధులకు హాజరవు సిబ్బంది హెల్మెంట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సువర్ణరాజ్ పాల్గొన్నారు.

వసతులు పరిశీలించాలి

గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో వసతులు పరిశీలించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారి నిఖిలతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో వీసీ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, స్త్రీ, పురుషులకు విడిగా మరుగుదొడ్డి, దివ్యాంగులు, వృద్ధులకు రాంప్ సౌకర్యంపై రిపోర్టు అందజేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

» ఎంపీ డీకే అరుణకు తపస్ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటచలపతి కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం 2010 కన్న ముందు ఉపాధ్యాయులగా నియమితులైన ఉపాధ్యాయులకు ఖచ్చితంగా టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. దీనిపై శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతానని, అంతకుముందే కేంద్ర విద్యాశాఖ మంత్రితో కూడా మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

జడ్చర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో శనివారం నిర్వహించిన మునిసిపల్ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి చట్టం చేసిందని, చట్టం అమలైతే కార్మికులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రెండో విడత పీఆర్సీ ప్రకటించాలని కోరారు. జడ్చర్ల మునిసిపల్ కార్మికులు 2012 నుంచి 2014 వరకు ఈపీఎస్ సమస్య ఉందని, మృతిచెందిన కార్మికులకు ఈపీఎఫ్ బెనిఫిట్స్ అందలేదని వాపోయారు. ఈపీఎఫ్ సమస్య పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 25, 26న తలపెట్టిన ధర్నాకు కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఇందిరమ్మ, యాదమ్మ, రమేశ్, సరిత, జంగమ్మ, శివమ్మ, శ్యామల, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

భూత్పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరణతో మండలంలోని కొత్తమొల్గర గ్రామం మార్మోగింది. గ్రామానికి చెందిన గురుస్వామి గాల్‌రెడ్డి శనివారం తన స్వగృహంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ నిర్వహించగా, జిల్లాలోనే పేరుగాంచిన శర్మ గురుస్వామి హాజరై పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వామి స్వాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల రాక.. ఆర్‌ఎంపీల పరుగు

నవాబ్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూర్ గ్రామంలో శనివారం పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు ఆర్‌ఎంపీ కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లగా తాళాలు వేసుకుని ఎక్కడికో వెళ్లి పోయారు. గ్రామంలో లక్ష్మన్‌రావు, అంజనేయులు, లక్ష్మి, రవి కేంద్రాలను మూసివేయడం పట్ల మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి రవిశంకర్

కోయిలకొండ, నవబంరు 22 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి రవిశంకర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పారుపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నేటికీ చట్టాల గురించి అవగాహన లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలని, బాల్య వివాహాలు చేయకూడదన్నారు. ముఖ్యంగా వృద్ధులను వేధింపులకు గురిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు.

● మహబూబ్‌నగర్ విద్యావిభాగం : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ మునవర్ హుస్సేన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో విద్యార్థులు భారత రాజ్యాంగానికి సంబంధించిన అన్ని అంశాలు తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగం ద్వారా చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండకుండానే వివిధ కేసుల్లో బాధితులగా నమోదు అవుతున్నారని, యువత ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ ఇజాజోద్దిన్, న్యాయ వాదులు యోగేశ్వరరావు, రవికుమార్‌యాదవ్, కృష్ణ, కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి పావని పాల్గొన్నారు.